# జేబుదొంగ

ద్వివేదుల విశాలాక్షి



కాలు కాలిన పిల్లిలా, ప్లాటుఫారం మీద కలయ తిరుగుతున్నాడు సుబ్బారావు. ఆ రోజు ఎక్స్‌ప్రెస్‌లో అతడు విధిగా హైదరాబాద్ వెళ్ళవలసి ఉంది. ఆ బండి తప్పిపోతే మరునాడు ఉదయం జరుగబోయే ఇంటర్వ్యూకి అందుకోవడం కష్టం.

సుబ్బారావు నిరుద్యోగజీవితపర్వంలో ఇది మొదటి ఇంటర్వ్యూ కాదు. బియ్యే డిగ్రీ చేతిలో పడ్డాక గత రెండు మూడు సంవత్సరాలుగా కొన్ని వందల ఉద్యోగాలకి అప్లికేషన్లు పెట్టేడు. కొన్ని పదుల ఇంటర్వ్యూలకైనా వెళ్ళి వచ్చేడు. అలా వెళ్ళి వచ్చిన దానికి గుర్తుగా స్నేహితుల దగ్గర అప్పులు పెరిగేయి. ఇంట్లో మిగిలిన చిల్లర మల్లరా సామాన్లు మిగిలేయి- వాటివల్ల అతడికి ఒరిగింది అంతవరకే.

కాని, ఈసారి వచ్చిన ఈ ఇంటర్వ్యూ

కార్డుకి ఒక ప్రత్యేకత ఉంది. అందుకే విధిగా వెళ్లాలని అంతగా ఆరాటపడ్తు న్నాడు. ఇంతకు పూర్వం వెళ్ళివచ్చిన వాటిలో ఉద్యోగం రావడానికి కంటే రాకపోవడానికే ఎక్కువ అవకాశం ఉన్నట్టు వంటివి. ఈసారి జరుగబోయే ఇంటర్వ్యూ అటువంటిది కాదు. భగవం తుడు కాస్త చల్లగా చూస్తే ఈ ఉద్యోగం చేతిలో పడ్డానికి మంచి అవకాశం ఉంది. ప్రైవేటు కంపెనీల్లో శక్తియుక్తులు ఉన్న వాళ్ళకి ముందుకు పోయేందుకు మంచి అవకాశాలు కూడా ఉంటాయి. ఈ నౌకరీ కూడా మంచిదే. అన్నీ కలుపుకొని మూడువందల వరకు దొరుకుతుంది. ఈ ఇంటర్వ్యూ కమిటీలో రామశాస్త్రి మామయ్య ఉండటం సుబ్బారావు అదృష్టం.

సుబ్బారావు, రామశాస్త్రి ఇంటర్ వరకు కలిసే చదువుకొన్నారు. ఆ వెనుక అతడికి ఇంజనీరింగ్‌లో సీటు రావడంతో కాకినాడ వెళ్ళిపోయేడు. సుబ్బారావు చచ్చీ చెడీ బియ్యే అయిం దనిపించి, పైహంగులుగా టైపు, షార్టు హేండు పరీక్షలు పాసై, ఇక మిగిలింది ఉద్యోగమే కదా అన్న అభిప్రాయంతో డిగ్రీ కాగితం, సర్టిఫికెట్లు చేతపట్టుకొని రోడ్డుమీద పడ్డాడు. 'ఉన్న ఊరు-కన్న తల్లి' అంటారు. ఇంత మంచి మార్కు లతో పాసైన తనకి ఆపాటి ఉద్యోగం రాక పోతుందా అనే ధీమాతో ఆర్నెల్లపాటు కాలరెత్తి పట్టుకొని గ్రాడ్యు ఏట్ పోజ్‌తో రోడ్లు సర్వేచేసి, ఒక జత చెప్పులు అరిగి, ఇంట్లో పస్తులు పెరిగి, కాస్త జ్ఞానోదయం కాగా అప్పటినుంచి బుద్ధిమంతుడిలా పేపర్లలో కనిపించే ప్రకటనలన్నీ ఓపిగ్గా చదివి - అందులో తన చదువుకి సరిపోయే ఉద్యోగాలకి అప్లికేషన్లు పెట్టసాగేడు. అలా విజ్ఞాప నలు పంపుకొన్న వాటిలో అన్నిటికీ కాక పోయినా కొన్నిటికైనా ఇంటర్వ్యూలకి పిలుపులు వచ్చేవి. దారిబత్తేలకి ఇంట్లో ఉన్న నగా నట్రా, ఊరిలో ఉన్న పర పతి ధారాళంగా ఖర్చుపెట్టి, ఉట్టి అప్లి కేషన్లకి ఇంటర్వ్యూలకి పిలుపులే వస్తాయి కాని ఉద్యోగాలు రావాలంటే ఆ అప్లికే షన్ కాగితం ఎగిరిపోకుండా దానిమీద 'బరువు' పెట్టవలసి ఉంటుందనీ, అది లేక పోతే దానికి దీటైన రికమెండేషన్ అయినా జత చెయ్యవలసి ఉంటుందనీ ఇంకో జీవిత సత్యాన్ని తెలుసు కొన్నాడు.

అంగ బలం అర్థ బలం లేని సుబ్బా రావు అంత కష్టపడి తెలుసుకొన్న అజ్ఞా నాన్ని ఏవిధంగానూ ఉపయోగించుకోలేక సతమత మవుతున్న తరుణంలో రామ శాస్త్రి దగ్గరినుంచి రామబాణం లాంటి ఒక ఉత్తరం వచ్చింది "ఓరీ సుబ్బా రాయుడూ! ఫలానా పేపర్లో పడ్డ ఫలానా ఉద్యోగానికి తప్పకుండా అప్లికేషన్ పంపు. అది మా మామయ్య చేతిలో

యువ




పెట్టు. నీ చేతిలో వాలేలా చేసి కొంచెం పుణ్యం మూటకట్టుకోవాలనే కోర్కె కలిగింది అంటూ. మిత్రుడి దగ్గరినుంచి అటువంటి ఉత్తరం రాకపూర్వమే అలవాటు పడ్డ సుబ్బారావు కళ్లు ఆ ప్రకటన చూడ్డం, సశాస్త్రీయంగా అప్లికేషన్ రాసి పోష్టు చెయ్యడం కూడా జరిగిపోయింది. దాని ఫలితమే మరునాడు జరుగబోయే ఇంటర్వ్యూ, అందుకే తప్పకుండా వెళ్లాలని ఆరాటం.

ఇలా ఇంటర్వ్యూకి పిలుపు వచ్చింది. ఫలానా నాటికి వస్తున్నాను ఈ లోగా మీ మామయ్యని కలుసుకుని నువ్వు చెయ్యగలిగింది ఏదో చేసిపెడ్తావని గంపెడాశతో ఉన్నాను-అంటూ మిత్రుడికి ఉత్తరమైతే రాసేడు కాని, "కోమటి నీ నెత్తిమీద తేలు"- అంటే "బాబ్బాబు నీ చేత్తోనే తీసిపారెయ్"అన్నట్లు, ఉద్యోగం ఇప్పిస్తానన్నావు కాబట్టి రానూ పోనూ దారి ఖర్చులు కూడా నువ్వే భరించాలి అంటూ స్నేహితుడికి ఉత్తరం రాయడానికి కొంచెం బిడియ పడ్డాడు సుబ్బారావు. తెగించి అలా రాస్తే ఆ మిత్రుడు డబ్బు ఖర్చుకు వెరచి అసలుకే మోసం చేస్తాడేమోనన్న భయం కూడా కొంత లేకపోలేదు ఉన్న ఊళ్ళో ఆపాటి సొమ్ము అప్పు పుట్టించుకోలేక పోతాడా- అన్న నమ్మకం ఒకటే - అన్నీ కలసి రామశాస్త్రికి రాసిన ఉత్తరంలో డబ్బు విషయం రాయకుండా చేసేయి.

ఊళ్లో ఉండి ఇంత కాలంగా ఆదుకొంటున్న మిత్రుల్లో కొందరికైనా సుబ్బారావుకి సహాయం చెయ్యాలనే అభిప్రాయం లేకపోలేదు. కాని సమయానికి కొందరి దగ్గర డబ్బులు లేకుండా పోయింది. మరికొందరికి యింతకు ముందిచ్చిన అప్పులు గుర్తుకొచ్చేయి. నాలుగు రోజులపాటు ముఖపరిచయం ఉన్నవాడినల్లా అడిగి లేదనిపించుకొన్నాక ఇంక ఊళ్లో అప్పుపుట్టే మార్గంలేదని గ్రహించి,

పెళ్ళాం మెడలో మంగళసూత్రాలు తీసి అమ్ముకొని ప్రయాణం సాగించాలనే నిర్ణయానికి వచ్చేడు సుబ్బారావు.

భర్త నోట ఆ మాట వినగానే కుమిలి కుమిలి ఏడ్చింది భార్యా రత్నం. "ఏం చేస్తాం రత్నం! ఈ ప్రయాణం మాను కొందికి లేదు. ఊర్లో ఎక్కడా అప్పు పుట్టలేదు. ఇంట్లో అవసరాలకి నీ చేత్తో నువ్వే ఒక్కొక్క నగా తీసి ఇచ్చిన దానివి ఇప్పుడు ఇంతలా ఏడుస్తున్నా వంటే, నీ మనసుని నేను అర్థంచేసుకో గలను రత్నం. ఈ ఉద్యోగం తప్ప కుండా అవుతుంది. మొదటి జీతం అందు కున్న నాడే అటునుంచి అలాగే బజారుకి వెళ్ళి......" భార్యని ఓదార్చడానికి సుబ్బారావు ఇంకా ఏమేమో చెప్పబో యేడు.

'నేను ఏడుస్తున్నది అందుకు కాదు' అన్నట్లుగా తల ఆడిస్తూ పైట కిందనుంచి పసుపుతాడు పైకి తీసింది ఆ ఇల్లాలు. అలా తీసిన పసుపు తాడుని కట్టిన అంగుళం పొడవున్న పసుపుకొమ్ము చూడగానే, ఎప్పుడూ ఎంతో ఓర్పుతో తనకి అన్ని విధాలా సహాయకారిగా ఉండే భార్య మంగళసూత్రం అనేసరికి అంతలా ఎందుకు ఏడ్చిందో సుబ్బా రావుకి అర్థమయింది. అనవసరంగా మానబోవుతున్న గాయాన్ని కెలికి ఆమెని బాధపెట్టినందుకు మనసులో నొచ్చు కున్నాడు.

అప్పటికి ఆరు నెల్లకి పూర్వం అక స్మాత్తుగా చంటిదానికి ప్రాణంమీదికొస్తే, అలవాటుపడిన పద్ధతిలో ఆస్పత్రిలో జబ్బుకు పనికివచ్చే మందులు నిండు కుంటే, కన్న పాపని రక్షించుకోవాలన్న ఆరాటంతో, ఎందరి దీవెనలతోనో, మరెందరి శుభకామనలతోనో మేళతాళాల మధ్య తన మెడలోకి వచ్చిన ఆ మాంగ ళ్యాన్ని తనంతట తనే నిర్లిప్తతతో తీసి ఇచ్చి - "వేగిరం వెళ్ళి మందులు కొనుక్కురండి" అంది రత్నం.

ఎంత వేగిరం రావాలని ఉన్నా జరుగకూడని ఆలస్యం జరిగిపోడం ఫలి తంగా పాప ఈ లోకాన్ని విడిచి పోవడం - దానికి గుర్తుగా రత్నం మెడలో పసుపుకొమ్ము, ఇంటి మూల గూట్లో ఎందుకూ పనికిరాని మందులు మిగిలిపోవడం జరిగింది. డబ్బు,ఉద్యోగం అన్న విషవలయంలో చిక్కుకొని మిగి లిన జీవితాన్నే మరచిపోతున్న సుబ్బా రావు మనసులో ఆ సంఘటన మరపుకి తిరిగినా తల్లి మనసులో ఆనాడు రేగిన మంట ఇంకా ఆరక రగులుతూనే ఉంది.

కొనఊపిరి వంటి ఆ ఆశ కూడా నశించిపోగా ఇంకేం చెయ్యాలో, ఎలా హైదరాబాద్ వెళ్ళాలో, పాలుపోని సుబ్బారావు మతిపోయిన వాడిలా కొంచెం సేపు అలాగే కూర్చుని, అంతలోనే ఏదో అందివచ్చినట్లు చటుక్కున లేచి, పెట్టెలో పదిలంగా దాచి ఉంచిన



ఒక్కొక్క జత ఇస్త్రీబట్టల్ని సంచిలో పెట్టుకొని "రత్నం నే ఊరికి వెళ్తున్నా, తలుపు వేసుకో" అన్నాడు.

పరిస్థితి ఏమిటో పూర్తిగా తెలిసిఉన్న రత్నం "ఎలా వెళ్తారు? డబ్బెక్కడిది?" అని భర్తని ప్రశ్నించలేదు. ఒకసారి తలఎత్తి జాలిగా అతడి వైపు చూసింది. అతడు వీధి గడప దిగి ప్రపంచంలో ఉన్న దైన్యం, నిస్సహాయత మూర్తీభవించినట్లు అలా తలవంచుకొని అడుగులో అడుగు వేసుకొంటూ వెళ్లిపోతుంటే, 'భగవంతుడా! నిన్ను ఎప్పుడూ ఏదీ కోరలేదు. ఈ రోజు నీముందు చేతులు జోడించి అర్థిస్తున్నాను. సిరిసంపదలు కావాలని లేదు. వస్తువులు వాహనాలు ఇమ్మని కాదు. ఏదో విధంగా అతడిని గమ్యస్థానం చేర్చు. ఇవి నువ్వు పోసిన ప్రాణాలు-నువ్వు ఇచ్చిన జీవితాలు-వీటితో ఆటలాడ్డానికి నీకు అన్ని విధాలా అధికారం ఉంది-కాని ఇంక సహించే శక్తి మాలో లేదు. ఈ బాధలకి తట్టుకోలేక, మంచిని మరచిపోయి, నీమీద నమ్మకం తుడిచిపెట్టుకుపోయి - అటువంటి జీవితం నిన్ను నమ్మిన వాళ్ళపై రుద్దడం. ఒద్దు స్వామీ-అంత కాఠిన్యం మాపై చూపకు - అందుకు అర్హులు కారు

ఈ అల్పజీవులు' - అంటూ రత్నం భగవంతుడి ముందు సాగిలబడి వేడుకొంది. కన్నీరు మున్నీరుగా విలపించింది.

ఆమె పెట్టుకొన్న మొర భగవంతుడికి వినిపించిందో లేదోకాని సుబ్బారావుకి మాత్రం వినపడలేదు. అందుకే భగవంతుడి మీద భరోసా పెట్టుకొని, చేతులు ముడుచుకొని కూర్చోక స్టేషనులో వచ్చి ఆగుతున్న ప్రతి రైలుని, అందులోంచి దిగుతున్న ప్రతి వ్యక్తిని క్రమం తప్పకుండా పరిశీలిస్తూ - అన్ని ముఖాల్లో ఒక్కటైనా తెలిసిన ముఖం కన్పించకపోతుందా అనే ఆశతో ప్లాటుఫారంపై తిరుగులాడుతున్నాడు. అతడు అలా ఆశ నిరాశల అల్లికలో చిక్కుపడి - ఆ రోజు రైలులో ప్రయాణంచేసే యోగం ఉందాలేదా - ఆ ఉద్యోగం అందుకునే అదృష్టం ఈ జీవికి రాసుందా? లేదా? అని మధనపడి పోతుంటే నెంబరు రెండు ప్లాటుఫారం మీదికి ఇంకో రైలు వచ్చి ఆగింది. అంతవరకు నల్లమందు భాయిలా మందకొడిగా ఉన్న ప్లాటుఫారం రైలు రాకతో ఒక్కసారిగా మత్తు వదలించుకొని ముఖానికింత సందడి పులుముకొని షోకు చేసుకుంది. ఎక్కేవాళ్లు, దిగేవాళ్లు, అమ్మకందారులు, అడుక్కునేవాళ్ళు రైల్లోవచ్చే వాళ్లని ఆహ్వానించడానికి, వెళ్ళేవారిని అంపకాలు పెట్టడానికి వచ్చిన బంధు మిత్రులు — ఒకటే తొక్కిడిగా హడావిడిగా తయారయింది ఆ ప్రదేశం.

మూడవ తరగతి ప్రయాణికులు పెట్టెల్లో ఎక్కడానికి ముష్టి యుద్ధాలు చేస్తుంటే, మొదటి తరగతివారు పెట్టెలకి పైన అంటించిన లిష్టుల్లో తమ పేర్లు చూసుకొని నిదానంగా లోపలికి అడుగు పెడ్తుంటే — వాటికి మరికాస్త దూరంగా, సుబ్బారావు నిల్చిన చోటికి పదిగజాల దూరంలో ఆగిన ఎ. సి. ఫష్టుక్లాసు పెట్టెలోకి ఎక్కడానికి వచ్చాడో పెద్దమనిషి. బాగాపొడుగు, అయినాపొట్టివాడులాకన్పించేంతగాపెరిగి పోయిన ఒళ్ళు, తలపై ఒత్తైన నెరసిన జుట్టు, ఆ జుట్టుని కొద్దిగా కప్పే తెల్లటి ఖద్దరు టోపీ... కొంచెం కొనతేరి ముందుకి వంగి ఉండే ముక్కు, అంత పెద్ద ముఖానికి కూడా పెద్దవే అనిపించేలా ఉన్న దొప్ప చెవులు... ఎవరికైనా ఒకసారి చూస్తేచాలు మనసులో నిలచిపోయే రూపం అతడిది. ఇస్త్రీ మడతలు నలగని తెల్లని పొందూరు ఖద్దరు పంచ, అంత తెల్లటిదే పొడుగు చేతులు, కంటి మెడ కల్లీలాల్చీ, దానిపై అత్తా కోడలంచు ఖద్దరునాణి... ఇతడు రూపులోనే కాక స్థితిలో, అధికారంలో కూడా పెద్దమనిషే అనిపిస్తుంది చూడగానే. దానికి తగినట్లే అతడి ముందు ఒక అరడజనుమంది అనుయాయులు అతివినయంగా చేతులు కట్టుకొని శ్రీవారి

మాటలకి చిత్తం చిత్తం అంటూ వారి ఆధిక్యతని వేనోళ్ల చాటుతున్నారు. ఇంతటి జీవితాన్ని అందుకోడానికి ఎంత పెట్టి పుట్టేడో అదృష్టవంతుడు... అనుకున్నాడు సుబ్బారావు అతడివైపు చూస్తూ.

అతడు తన పెద్దరికానికి సరిపడా ముఖానికింతగాంభీర్యం పులుముకొని ఎదుట ఉన్నవారికి ఏవేవో విలువైన సలహాలు ఇస్తున్నాడు ... మధ్య మధ్యలో హెచ్చరికలు చేస్తూ, విమర్శిస్తూ, ఏ చిన్ని విషయానికో కోపగించుకొంటూ, అంతలోనే సంభాషణ మార్చి ఉత్సాహంగా వారిని నవ్విస్తూ, తాను నవ్వుతూ... తనమాటలు, ఆదేశాలు వారిపై ఎటువంటి ప్రభావం చూపుతున్నాయో క్రీగంట పరిశీలిస్తూ... ప్రతి మాటలో, ప్రతి చర్యలో తనకూ వారికీ మధ్యగల దూరం చెరగకుండా కాపాడుకొంటూ...

ఇన్ని చెమకులు తెలిసినవాడు ఇతడు ఏ రాజకీయ నాయకుడో అయి ఉండాలి అనుకున్నాడు సుబ్బారావు. కాస్సేపు తన సమస్యని మనసులోంచి పక్కకి నెట్టి ఆ పెద్దమనిషిని... అతడి భృత్యబృందాన్ని తమాషాగా చూస్తూ ఉండిపోయేడు.

రైలు కదలబోతూ కూతవేసింది. శ్రీవారు పెట్టెలోకి ఎక్కబోతూ అంతలో ఏ అత్యవసర విషయమో గుర్తుకిరాగా పైకి పెట్టిన ఖిక్కపాదాన్ని తిరిగి కిందికి దింపి ఇటు తిరిగేడు. చివరి క్షణంలో శ్రీవారు సెలవివ్వనున్న ఆ అమూల్యమైన విషయంలో ఒక అక్షరమేనా పొల్లుపోకుండా వినాలనే ఆత్రంతో అనుయాయులంతా మరికాస్త ముందుకి వచ్చి, వారిముఖం మీదే తమ తమకళ్ళు కేంద్రీకరించి ఆ నోట రాలబోయే ముత్యాలుఏరుకోడానికి సిద్ధంగా నిలచేరు.

అందరితోపాటు సుబ్బారావు కూడా ఆ ముఖ్య విషయం ఏమైఉంటుందా అనే కుతూహలంతో వినడానికి వీలుగా మరిరెండు అడుగులు ముందుకి వేసేడు. కాని, శ్రీవారు నోరు తెరచి అదేదో సెలవియ్యబోయే సరికి సుబ్బారావు కాలు మీద ఒక కండచీమ చిటుక్కున కాటువేసింది. కాస్త ముందుకి వంగి ఇంకా కాలుకి అంటిపెట్టుకొన్న ఆ చీమని పైకి పీకి కసిగా అంత దూరం విసిరి తిరిగి తల ఎత్తబోయేసరికి పాలమీగడ లాంటి శ్రీవారి లాల్చీ పక్కజేబు దగ్గర నల్లగా ఏదో మరక కన్పించింది. అంతకు క్షణకాలం ముందు అక్కడ లేని ఆ మరక అప్పటికప్పుడు అక్కడ ఎలా ఏర్పడిందా అని పరిశీలనగా చూస్తే అది మరక కాదని ఆ పెద్దమనిషి జేబులోంచి సన్న సన్నగా పర్సులాగుతున్న చిన్నవాడి చెయ్యి అని తేలిపోయింది. ఆ చెయ్యిని అనుసరించే చూపుని నడిపిస్తే - ఆ చెయ్యి

తాలూకు వ్యక్తి రైలుపెట్టికి పక్కగా పెద్దమనిషి స్థూలకాయం వెనుక నక్కి అతి చాకచక్యంగా తన పని తాను చూసుకొంటున్నాడు. తనని ఎవరైనా చూస్తున్నారేమోనని చింతాకుల్లాటి చిన్న కళ్లని ఇటు అటూ తిప్పి కంగారుగా చూస్తున్నాడు. అదిగో అలా చూస్తున్నప్పుడే సుబ్బారావు కళ్లతో వాడికళ్ళు ఢీకొట్టాయి. చలిజ్వరం వచ్చినవాడిలా వాడి ఒళ్లంతా వణకసాగింది. అప్పుడే వాడి చేతిలోకి వచ్చిన తోలు పర్సు ఆ చేతితో పాటు క్షణకాలం ఎగిరెగిరిపడి నెమ్మదిగా కిందికి జారిపోయింది. మరు క్షణంలో చూస్తే ఆ కుఱ్ఱాడు కాలికి బుద్ధి చెప్తూ పదిగజాల దూరంలో కన్పించేడు. 'దొంగ... దొంగ' అని అరవాలనుకున్నాడు సుబ్బారావు. పరుగున పోయి మట్టి కొట్టుకొని, చిరిగి పేలికలైనవాడి కమీజు అందుకోవాలనుకున్నాడు.

కాని మనసులోకి వచ్చిన రెండు ఆలోచనల్లో ఒక్కటి కూడా క్రమలో పెట్టలేదు. ఉన్న చోటనే నిల్చి ఆ పిల్లాడు జారవిడిచిన పర్స్ ఎక్కడ పడిందా అని చూసేడు. ప్లాటుఫారం మీద అది కన్పించలేదు. బహుశ రైలుపెట్టికి ప్లాటుఫారానికి మధ్యగల కాళీలోంచి కిందికి జారిపోయి ఉంటుంది. పెద్దమనిషి పర్సు విషయం పట్టించుకోకుండా రైలు తనదారిన తనుపోయింది. తనతోపాటు ఆ పెద్దమనిషినీ ... అటువంటి ఇంకా ఎందరో చిన్నా పెద్దా ప్రయాణికుల్ని మోసుకొంటూ.

కొత్తగా పెళ్ళిచేసుకున్న జంట హనీ మూన్‌కి వెళ్ళిపోగానే మిగిలిన బంధుమిత్రు లొకరొకరుగా పెళ్ళిల్లు కాళీచేసి వెళ్లిపోయినట్లు రైలు తన దారిన తను వెళ్ళిపోగానే ప్లాటుఫారం మీద మిగిలిన జనం అంతా ఎవరి మట్టుకి వారు వెళ్ళిపోయేరు.

అలా ఎవరి మానాన వారు వెళ్ళిపోయి ప్లాటుఫారం అంతా రమారమి ఖాళీ అయిపోగానే తిరిగి తన బాధల్లో తాను మిగిలి పోయేడు సుబ్బారావు. ఇంక ఏ నిముషంలో అయినా ఎక్స్‌ప్రెస్ రావచ్చు, తన ప్రయాణం మాటేమిటి? ఇంతకాలంగా ప్రయత్నిస్తే దొరకని డబ్బు ఇప్పుడు ఉన్నపళంగా ఎలా దొరుకుతుంది? ఏ రైల్లోంచి ఏ దేవుడు మిత్రుడి రూపంలో వచ్చి ఇదిగో సుబ్బారావు ఈ డబ్బుతో నీ అవసరం గడుపుకో – అని సహాయం చేస్తాడు? డబ్బు లేకుండా ప్రయాణం ఎలా జరుగుతుంది?... టికెట్టు కొనకుండా ఎక్కిపోతే?... తన రోజులు బాగులేక ఏ టి. సి. అయినా చూసి రెక్క పట్టుకొని ఈడ్చి పారేస్తే అంత ప్రమాదం లేదు. ఆ రైలులో దిగినట్లే దిగి ఇంకో రాదిలో ఎక్కిపోవచ్చు... అలా కాక పోలీసు




లకి అప్పగిస్తే... కానున్న ఇంటర్వ్యూ, రానున్న ఉద్యోగం అన్నీ గోవిందా.

ఆలోచనల ప్రవాహంలో కొట్టుకు పోతూ, నెమ్మదిగా అడుగులువేస్తూ ప్లాటుఫారం చివరగా నడకసాగించాడు సుబ్బారావు. అకస్మాత్తుగా అతడికాళ్లు వాటంతట అవే ఆగిపోయేయి. పట్టాలకి ఇవతలగా కంకరరాళ్ళమీద గర్భిణీ స్త్రీలా పొట్ట ఉబ్బెత్తుగా పెంచుకొని అలసట పోగొట్టుకోడానికి విశ్రాంతి తీసు కొంటున్నట్లు పడి ఉంది అందమైన తోలుపర్స్. క్షణకాలం అతడిదృష్టి ఆ పర్స్‌మీద నిలచింది. అంతలో కళ్ళలో మెరుపు, మనసులో ఏవో ఆలోచనలు నిర్ణయాలు నిముషాలమీద జరిగి పోయేయి. కలవరపాటులో ఒక్కసారి ఇటు అటు చూసేడు. తనుకాక ఆపర్స్‌ని ఇంకెవరైనా చూసి ఉంటారా—అనే సందే హంతో కాస్తదూరంలో నలుగురైదుగురు మనుషులు తమలోతాము ఏదో చర్చించు కొంటూ కబుర్లు చెప్పుకుంటున్నారు. అంతకుమించి పరిసరాల్లో జనసంచారం లేదు.

మనసుకి ధైర్యంచెప్పి అప్పటిమట్టుకి అంతరాత్మని బుట్టకింద దాచిపెట్టి ఎటో పరధ్యానంగా చూస్తున్నట్లు నటిస్తూ తన చేతిలో ఉన్న రుమాలుని కిందికి మెల్లగా జారవిడిచేడు సుబ్బారావు. అతడిచేతిలో ఉండే రుమాలు పట్టాలికి ఇటుగా పడి పోడం అక్కడ నిలబడిఉన్న వారిలో కొందరు చూసేరు. దానికోసం అతడు ప్లాటుఫారం అంచునుంచి కిందికి దిగడం కూడా కొందరు చూడకపోలేదు. చేతి రుమాలుతోపాటు అతని చేతిలోకి తోలు పర్సురావడం మట్టుకు ఎవరూ గుర్తించ లేదు. అంత చాకచక్యంగా ఆ పని నిర్వ

ర్తించగలిగినందుకు తనని తనే అభినందించుకున్నాడు సుబ్బారావు.

చేతిరుమాలు ముసుగులో తోలుపర్స్ మెత్తగా, వెచ్చగా ప్రియురాలి స్పర్శలా ఉత్సాహాన్ని, తృప్తిని కలిగిస్తున్నది. అందులో దాగున్నడబ్బు మనసుని కోర్కెలతో నింపుతున్నది. పర్సులో ఉన్న డబ్బు ఎంతో కళ్ళతోచూసి తరించాలని సుబ్బారావు మనసు తహతహలాడి పోతోంది. నెమ్మదిగా అడుగులు వేస్తూ పాతికగజాల దూరంలో ఉన్న పబ్లిక్ లేవటరీలోకి దూరి తటాలున తలుపు గడియవేసుకొన్నాడు. తనను ఎవరూ ఏ విధంగానూ గమనించే అవకాశంలేదని నిర్ధారించుకొన్నాక పర్స్ కున్న జిప్‌లాగి అప్పుడేపుట్టిన బిడ్డని కన్నతల్లి ఆప్యాయంగా చూసుకొన్నట్లు లోపలికి దృష్టి సారించేడు. ఒక్కసారిగా అతడికళ్లు బైర్లుకమ్మేయి. ముఖం తిరిగినంత పనయిపోయింది.

సుబ్బారావు తనకి జ్ఞానం వచ్చేక ఎన్నో రకాల మోసాలు చిన్నా పెద్దా జరుగుతుండడం నిత్యజీవిత వ్యవహారాల్లో చూసేడు. కొన్నిటికి తనే గురి అయి డోకా తిన్నవికూడా లేకపోలేదు. అయితే ఇప్పుడు తిన్న కాజా ముందు అవన్నీ దిగతుడుపుకైనా పనికిరాకుండా పోయేయి. అంత పెద్దమనిషి జేబులో నిండుగా పండులావున్న ఆ పర్స్‌లో కొన్నివేలు లేకపోయినా కనీసం కొన్ని వందలయినా రూపాయలు విధిగా ఉంటాయని అనుకొన్నాడు. పాపమో - పుణ్యమో దానికి చెల్లించవలసిన మూల్యం ఏమైనప్పటికి ఒక్కసారి ప్రలోభానికి లొంగిపోయేడు. ఈ దెబ్బతో ఊళ్లో మూలుగుతున్న చిల్లరా మల్లరా అప్పులు తీరిపోయి కొన్ని నెలలపాటైనా హాయిగా తిని తిరగడానికి అవకాశం ఏర్పడుతుంది. అదృష్టం బాగుండి అందులో ఇంకా పెద్దమొత్తమే సాక్షాత్కరిస్తే, ఏ కారణంగానైనా ఈ ఉద్యోగంరాక పోయినా ఆ సొమ్ము మదుపుపెట్టి చిన్న వ్యాపారం లాంటిది మొదలుపెడ్తే ఏదోవిధంగా బ్రతుకు బండిని లాగేయవచ్చు-అనుకున్నాడు.

అంత ఆశతో పర్సుతెరిచి చూస్తే అతడి కళ్ళలో నీళ్ళుతిరిగేయి. వ్రతం చెడ్డా ఫలందక్కలేదు. మూడు పది రూపాయలనోట్లు రెండు రూపాయనోట్లు కొద్దిగా చిల్లరా ఉంది అందులో. మిగిలిన స్థలం అంతా ఏవోబిల్లులు, రశీదులు, పకోడీపొట్లాలకైనా పనికిరాని చిన్నచిన్న కాగితాలు ఆక్రమించుకొన్నాయి.

లోనలొటారం పైకి బండారంగా ఉండే పెద్దవాళ్ళ జీవితాలకి నిదర్శనం ఈ పర్స్ అనుకున్నాడు సుబ్బారావు. నోట్లని మడిచి పదిలంగా జేబులో పెట్టుకొన్నాడు. పర్సునియథాప్రకారం రుమాలులోచుట్టపెట్టి పేంటు జేబులోకి పోనిచ్చాడు. అది కాస్తా బైటికి తొంగిచూసి

నేనిక్కడ ఉన్నానండోయ్ - అంటూ దండోరా వెయ్యకుండా ఎడంచేత్తో దాని నోరునొక్కి నిదానంగా బైటికి వచ్చేడు.

పావుగంటకి పూర్వం దానినికైవసం చేసుకోడం ఎలాగా అని తెగ ఆలోచించేడు సుబ్బారావు. ఇప్పుడు దానిని వదుల్చుకోడం ఎలాగా అని కంగారు పడ్తున్నాడు. అలా ఆలోచిస్తూనే రైల్వే లైన్ వెంట కొంతదూరం నడిచేడు. స్టేషన్‌కి నాలుగు ఫర్లాంగులదూరంలో లైన్‌మీద కూలీలు పనిచేస్తున్నారు. అతడు అటురావడంచూసి "బాబూ టైమెంతయింది'' అని అడిగేరు. సుబ్బారావు చేతికి వాచీలేదు. నోటికొచ్చిన వేళ ఏదో చెప్పేడు. "తినేసొద్దాం రండేస్" అంటూ కూలీలు చేతిలోని పలుగుల్ని, పారల్ని ఒకపక్కగా కూలవేసి చేతులకంటుకొన్న మన్ను దులుపుకొంటూ స్టేషన్‌వైపుకి దారి తీసేరు.

తన జేబులో దిగలాగుతున్న బరువును వదుల్చుకోడానికి ఇంతకన్న మంచి సమయం, స్థలం దొరకదనుకొన్నాడు సుబ్బారావు. రైలుకట్టకి కొంచెందూరంలో రెండు చిన్న తాటి మొక్కలు, ఒక ముళ్ళగోరింటమొక్క ముద్దుముద్దుగా చేతులుకలుపుకొని 'చెమ్మచెక్క' ఆడుకొంటున్నాయి. ఒకసారి ఇటు అటు చూసి పరిసరాల్లో జన సంచారం లేదన్న నిర్ధారణకొచ్చి జేబులోంచి తీసిన పర్స్‌ని నెమ్మదిగా వాటి మధ్య జారవిడిచేడు. తేలికపడ్డ మనసుతో అతడు తిరిగి స్టేషనులోకొచ్చి బుకింగ్ కౌంటర్‌ముందు క్యూ తప్పించినందుకు మిగిలిన వారిచే దీవనలు అందుకొని టికెట్టు చేతబట్టుకొని బైటపడే సరికి ఒకటోనంబరు ప్లాటుఫారంమీద ఎక్స్‌ప్రెస్ కదలటానికి సిద్ధంగా ఉంది. ఎదుట ఉన్న పెట్టిలోకి ఉరుకులు పరుగులుగా వెళ్లి ఎక్కి, మరికా స్సేపట్లో కూర్చోడానికి జాగాకూడా సంపాదించుకొని 'హమ్మయ్య' అంటూ పెద్దగా ఒక నిట్టూర్పు విడిచేడు సుబ్బారావు, అయిదారు రోజులుగా మనసులో పేరుకు పోయిన భారం తేలిపోయేలా.

సుబ్బారావు వెళ్ళేసరికి రామశాస్త్రి ఆఫీసుకి వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. "ఇప్పటిదాకా రాకపోతే ఇంకరావేమో అనుకున్నాను" అన్నాడు.

"ముందుగారావాలనే అనుకొన్నాను. కాని" మాటపూర్తి చెయ్యకుండా నసిగేడు సుబ్బారావు.

''సర్లే...ఇంకా వేళుందిగా కాళ్ళుచేతులూకడుక్కొని భోజనంచేసి బయలుదేరు. నీ విషయం అంతా మామయ్యతో చెప్పాను. ధైర్యంగా వెళ్లిరా. ఈ ఉద్యోగం నీకు తప్పక దొరుకుతుంది." అంటూ మిత్రుణ్ణి ఉత్సాహపరచేడు రామశాస్త్రి.

ఇంతకు పూర్వం ఇంటర్వ్యూలకి వెళ్లేటప్పుడు ఏదో చికాకు, భయం.

ఇంతవరకు ఎన్నిటికి వెళ్ళలేదు. ఇది మాత్రం ఇంకోలా అయేందుకు అవకాశం ఏముంది? ఈ విధంగా ఇంట్లో డబ్బు వంట్లో శక్తి వెచ్చబెట్టుకోడమే కాని ఇవి వచ్చిచస్తాయా? అనే నిరాశ సుబ్బారావుని కుంగదీసేది. కాని ఈసారి తన అప్లికేషన్‌కి రామశాస్త్రి మామయ్య అంతటివాడి(పేరేమిటో అడగడంమరచిపోయేడు.)రికమండేషన్ ఉండగా పైగా అతడు ఇంటర్వ్యూ కమిటీలో ఒకడు కాగా ఈ ఉద్యోగం రాకేం చేస్తుంది? ఇది ఎలాగా తనకే రాసిపెట్టింది - అనే నమ్మకంతో, ఇంటర్వ్యూ జరగబోయే గదిలోకి ధైర్యంగానే కాలుపెట్టేడు. వాళ్లు అడిగిన మొదటిరెండు ప్రశ్నలకి తడుముకోకుండానే జవాబులు చెప్పేడు. అంతలో వచ్చింది అతడిమనసులోకి ఒక ఆలోచన-ఎదుటఉన్న వ్యక్తుల్లో రామశాస్త్రి మామయ్య ఎవరై ఉంటాడా అని. అతడిని ఎప్పుడో చాలాకాలం కిందట ఒకసారి చూసేడు. అదీ చాలా కొద్దిసేపు. ఈ జ్ఞాపకంతో పోల్చుకోగలడా అని తన జ్ఞాపకశక్తిని పరీక్షకి పెట్టేశాడు. ఎదుటఉన్నవారిలో ఒక్కొక్కరినీ అలా పరీక్షగా చూసుకొంటూ పోగా ఒక వ్యక్తిదగ్గరికి వచ్చేసరికి అతడి చూపులు అగిపోయేయి. కనుపాపలు చలనం లేకుండా నిలిచిపోయేయి. పైన పంఖాతిరుగుతున్నా చెమటతో అతడి బట్టలు తడిసిపోయేయి. మంచుపై నిలచినట్లు కాళ్ళలోంచి మంటలురేగి మొద్దుబారిపోయేయి. అతి ప్రయత్నంమీద ఒక్క క్షణకాలంపాటు కనురెప్పలు కిందికిదించి మళ్లీ అతడివేపు చూసేడు. అతడుకూడా సుబ్బారావువైపు పట్టిపట్టి చూస్తున్నాడు. అంతలో ఇతడెవరో తెలిసిపోయినట్లు నిర్ణయించుకొని చూపులు తిప్పుకొన్నాడు. అతడు తనని పోల్చుకున్నాడు అన్న సంగతి సుబ్బారావుకూడా గ్రహించేడు. గుండెల్లోంచి కుదుపులాంటిది ప్రారంభమయింది. నోటతడారిపోయింది. ఇంకేం అనుమానానికి ఆస్కారంలేదు. ఇతడు ఆపెద్ద మనిషే...ఒడ్డూ పొడుగూ, కట్టుబొట్టూ నెరసిన ఆజుట్టు అప్పుడు టోపీపెట్టుకొన్నాడు. - ఇప్పుడులేదు - అప్పుడు పంచా లాల్చీలో ఉన్నాడు - ఇప్పుడు సూటువేసేడు. అయినా అతడిని తను పట్టిపట్టి అంతసేపు చూడబట్టి ఇప్పుడు దుస్తుల్లో మార్పు ఉన్నా వెంటనే పోల్చుకోగలిగేడు - అతడే ఇతడు అనడానికి ఇంకోనిదర్శనం. అతడుకూడా తన్ను పోల్చుకోగలగడం-

ఆ వెనుక వారేం అడిగేరో, తనేం చెప్పేడో ఇంటర్వ్యూగదిలోంచి బైటికొచ్చి రామశాస్త్రి ఇంటికి ఎలా చేరేడో అవేమీ సుబ్బారావుకి గుర్తులేవు. అతడి మనసుకి తెలిసిందంతా ఒక్కటే. ఈ ఉద్యోగం తనకి చచ్చినారాదు. ఇంకా చిక్కులపాలు కాకుండా ఇక్కడనుంచి




ఎంతవేగిరం వెళ్ళిపోతే అంతమంచిది-అని.

ఇంట్లో కాలు పెడ్తూండగానే ఎదురు పడి "ఎలా చేసేవు" అన్నాడు రామ శాస్త్రి ఉత్సాహంగా.

"బాగానేచేసేను" మిగిలిన కథ మిత్రుడిముందు చెప్పడానికి సుబ్బా రావుకి ధైర్యం చాలలేదు.

''మామయ్య నిన్ను పోల్చు కొన్నాడా?" పోల్చుకొనే ఉంటాడులే అనే భావం ధ్వనించింది ఆ ప్రశ్నలో.

"ఏమో"

"తప్పకుండా పోల్చుకొనేఉంటాడు-మనుషుల విషయంలో మామయ్య జ్ఞాపక శక్తి మా గొప్పది. ఒక్కసారి ఒక వ్యక్తిని చూసేడంటే తిరిగి ఎంత కాల మైనా ఇట్టే పోల్చేసుకొంటాడు. ఊరకే పోల్చుకోవడమేకాదు. ఎప్పుడు ఎక్కడ ఎలా కలుసుకొన్నదీకూడా చెప్పగలడు. సరి. నీకు మామయ్య తెలుసుకదా మనం ఇంటర్ చదువుతుండగా రెండుసార్లు వచ్చేరు-ఒకసారి ఏదో హోటల్లో అతని తోపాటు కాఫీ ఫలహారాలు కూడా తీసు కొన్నాం. అయినా ఆ ఒడ్డూ, పొడుగూ అప్పటికే జుట్టు నెరసిందనుకో..."

స్థిరంగా నిలబడాలని సుబ్బారావుచేసిన ప్రయత్నానికి కాళ్లు సహాయ నిరాకరణ చేసేయి. అట్టే మొండికెత్తుతే నిలబడ్డ వాడు ఆ పళంగా పడిపోయే ప్రమాదం ఉందనిగ్రహించి పక్కగా ఉన్న కుర్చీలో కూలబడ్డాడు.

"ఇంతగా ఎందుకడుగుతున్నా నంటే...'' రామశాస్త్రి మిత్రుడి పరిస్థితి గుర్తించలేదు. అతడి దృష్టంతా సుబ్బా రావు మామయ్యని గుర్తించేడా. ఆ ఉద్యోగం అతడికి వచ్చేలా గట్టిగా ఒక మాట అంటాడా అనడా - అన్నదాని మీదే ఉంది.

"నీ గురించి మామయ్యతో అంతా చెప్పేననుకో - నీ రూపురేఖలతోపాటు మాట్లాడేటప్పుడు ఒక కంటిరెప్ప కొంచెం పైకి ఎగరెయ్యడం ఉండుండి తల గోక్కోడం వగైరా అన్నీ ... కానీ నా మాటలు మామయ్య బుర్రలోకి ఎక్కేయాలేదా అని నాక్కొంచెం అనుమానం కలిగింది. కారణం అతడు ఇటీవలనే ప్రయాణంలో పర్స్ పోగొట్టుకొన్నాడు, దానిలో డబ్బుమాటకేంగాని చాలా ఇంపార్టెంటయిన కాగితాలు ఉన్నాయిట. అవి పోయినా, యితరుల చేతుల్లో పడినా కంపెనీకి అనుకూలంగా తనకి చాలా నష్టం కలగవచ్చని కంగారు పడుతున్నారు. ఆ కారణంగా మనిషి బాగా అప్‌సెట్ అయి ఉన్నారు..."

"ఇంక నే వెళ్తారా" చావిట్లో ఉన్న సంచి చేతిలోకి తీసుకొంటూ లేచాడు సుబ్బారావు.

"అదేమిటి ఇంతదూరం వచ్చి ఇలా వెంటనే వెళ్ళిపోడం ఏమిటి? ఒక రెండు రోజులుండి...నా అభిప్రాయంలో ఈ ఉద్యోగం ఆర్డరు చేతిలోపడ్డాక వెళ్ళి... ఏకంగా ఫామిలీని వెంటబెట్టుకొస్తే... మంచిది. నీవైతే రేపు ఒకసారి మామయ్యనికూడా కలుసుకోవచ్చు..."

"లేదురా! ఇప్పుడు వెంటనే వెళ్లాలి...మళ్లా వస్తాగా" అన్నాడు సుబ్బారావు అతడికి ఇంకోమాట అనేందుకు సమయాన్ని ఇయ్యకుండా. వీధిలోంచి పోతున్న రిక్షా ఆపి ఎక్కి కూర్చున్నాడు.

మిత్రుడి ఉద్యోగవిషయం కనుక్కోడానికి మరునాడే మేనమామదగ్గరికి వెళ్లాడు రామశాస్త్రి. అతన్ని చూస్తూనే కోపంతో ఇంతెత్తు ఎగిరిపడ్డారు సీతాపతి "నువ్వు ఇంతవాడు అంతవాడు-కాలేజీలో ఎప్పుడూ ఫస్టుమార్కులే అంటూ అంతగా చెప్తే, పోనీ లేమితో బాధపడుతున్నాడన్నావు ఏదో చేతిలో ఉన్న సాయం చేద్దాం అనుకొన్నాను ... కాని ...ఇక ముందెప్పుడూ ఇటువంటి చవటల్ని గురించి నాతో చెప్పకు. ఒకమాట వెయ్యడానికైనా మనిషిలో కొంచెమైనా పస ఉండాలికదా..." అన్నారు.

చదువుకొనే రోజుల్లో ఎంతో తెలివిగా చురుకుగా ఉండే సుబ్బారావు ఈ పాటి ఇంటర్వ్యూలో అడిగే ప్రశ్నలకి తిన్నగా సమాధానాలు చెప్పలేకపోయేడంటే రామశాస్త్రి నమ్మలేకపోయేడు. ఎన్నో ఆశలుపెట్టి, అతడిని అనవసరంగా శ్రమపెట్టి ఇంతదూరం రప్పించి ఏమీ చెయ్యలేకపోయేనే అని ఎంతగానో మనసులో నొచ్చుకొన్నాడు.

ఇంక సుబ్బారావుకి ఆ ఉద్యోగం వచ్చే అవకాశంలేదని తెలిపోయేక తన సానుభూతి తెల్పుతూ ఒక్క పెద్ద ఉత్తరం రాసేడు. ఆ సమయంలో మామయ్య అన్యమనస్కుడుగా ఉండడం



వల్ల అలా జరిగిపోయింది. ఇంకోసారి అవకాశం చూసుకొని గట్టిప్రయత్నం చేద్దాం. నువ్వేం నిరాశపడకు-త్వరలోనే ఇంతకంటే మంచి ఉద్యోగం నిన్ను వెతుక్కొంటూ వస్తుందినా మాటనమ్ము-అంటూ ఏమేమో రాసేడు.

ఉత్తరం పోష్టుచేసి తిరిగి వస్తుంటే పోష్టుమ్యాన్ ఎదురుపడి 'బాబూ మీకు పార్సెలు ఉంది' అంటూ అందించేడు, ఇంటికివచ్చి చింపిచూస్తే-అది రామశాస్త్రి మేనమామ సీతాపతి పోగొట్టుకొన్న పర్సు. దానితోపాటు ఒక టైపుచేసిన ఉత్తరంకూడా ఉంది,

"నేను, జేబుదొంగనుకాను. కాని ఈ పర్సు పోవడానికి పరోక్షంగా కారకుణ్ణి. అందుకే దానిని హక్కుదారుడికి అందజెయ్యవలసిన విధి నాపై ఉన్నట్లు భావించి మీద్వారా ఈపని సాధ్యం అని తలచి ఇలా పంపుతున్నాను. ఇందులో ఉంతవలసిన డబ్బుమాత్రంలేదు. పర్సు పోగొట్టుకున్న వ్యక్తిదృష్టిలో అదేమంత పెద్దవిషయం కాకపోవచ్చు...."

ఉత్తరంకింప సంతకంలేదు. పోష్టు ముద్రలు తిన్నగాలేవు. సరే ఎవరు పంపుతేనేం ... దీనితో మామయ్య ఆరాటం తెలిపోయి మనసు కుదుటపడు తుందని ఉరుకులు పరుగులుగా వెళ్ళి అతడికి అందజేసేడు రామశాస్త్రి. కాస్త సేపు ఆ పర్సుని ఉత్తరాన్ని తిప్పితిప్పి చూసి, క్షణకాలం ఏదో ఆలోచించి, గుర్తుచేసుకొని, ఇది ఎవరుపంపారో తెలిసిపోయింది. అన్నాడు అతను.

"ఎవరు ?" అన్నాడు రామశాస్త్రి కుతూహలంతో.

"నీ మిత్రుడు"

రామశాస్త్రి పిడుగుపాటు తిన్న వాడిలా దిమ్మెరపోయేడు. మిత్రుడిపై మేనమామ అటువంటినింద "సుబ్బారావు అటువంటివాడు కాడు...వాడి ప్రాణం పోయినా..."

"ఆకలి ... అవసరం మనిషిచేత ఎటువంటి పనులయినా చేయిస్తాయి"

"నే నమ్మను..."

"నీ జుట్టు ఇంకా నల్లగా ఉంది... నా జుట్టు తెల్లబడింది. కేవలం వయసు వల్లనేకాదు. జీవితంలో నేర్చుకొన్న పాఠాలతో, అనుభవాలతో..."

కాస్త నిదానంగా ఆలోచించేక అతడు అన్న మాటల్లో కొంత నిజం ఉండకపోదనిపించింది రామశాస్త్రికి. ఇంటర్వ్యూనుంచి తిరిగివచ్చేక మిత్రుడి ప్రవర్తన, అతడు ఉన్నపాళంగా వెళ్ళి పోవడం తనకి సహాయ పడబోయే వ్యక్తిని కలుసుకోడానికి ఏపాటి ఉత్సాహం చూపకపోవడం - పైగా ఈ పర్సు తన అడ్రసుకిరావడం; ఇంతేకాక ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నలకి జవాబులు చెప్పలేక సుబ్బారావంతటి వాడు తికమకపడ్డం—ఇవన్నీ కలిపిచూస్తుంటే మొత్తం పరిస్థితిఅంతా ఏదో అసహజంగా అనిపించింది. దీని కంతటికి కారణం మామయ్య చెప్పిందేకావచ్చు - అన్న అనుమానం కలిగింది. అదే నిజమైతే మిత్రుడికి ఏదో సహాయపడ్దామనుకొని చేసినప్రయత్నం అతడి నాశనానికే దారితీసేదిగా తయారయింది. ఎన్నో ఆదర్శాలు. నీతి నిజాయితీవంటి విలువలతో పెరిగిన సుబ్బారావు ఈ పతనానికి చాలవరకు బాధ్యత తను వహించవలసి ఉంటుంది. అరచేతితో పండులా ఉద్యోగాన్ని అలరపెట్టి "రారా" అంటూ ఉత్తరం అయితే రాసి పారేసేడు కాని, నాలుగేళ్లుగా నిరుద్యోగంతో బాధపడుతున్న సామాన్యసంసారి దగ్గర దారిఖర్చులకి సరిపడా సొమ్ము ఉంటుందా ? ఉండదా ? ఉన్నఊళ్లో అప్పుపుడుతుందా? పుట్టదా-అన్న ఆలోచన మనసులోకి రాలేదు.

"ఇంకా మీ మిత్రుడిగురించే ఆలోచిస్తున్నావా ? నమ్మకం కుదరలేదన్న మాట ?" అన్నాడు సీతాపతి చిన్నగా నవ్వుతూ.




"నమ్మక తప్పనట్లేఉంది. కాని... అదే నిజమైతే మీరు ఈ ఉద్యోగం అతడికే తప్పకుండా ఇవ్వాలని నా అభిప్రాయం.

"దేనికి? ఆఫీసుకి వచ్చే కష్టమర్స్ జేబులు కాళీచేసి కంపెనీ ఆదాయం పెంచేటందుకా?" వ్యంగ్యంగా నవ్వుతూ అన్నాడు సీతాపతి.

"కాదు ... మీవంటివారి జేబులు భద్రంగా ఉండేందుకు ఇప్పటికే ఉన్న జేబుదొంగల లిష్టులో ఇంకో అంకె పెరక్కుండా ఉండేటందుకు" ఇప్పుడు జరిగిన సంఘటనతో అతడికి ఈ ఉద్యోగం, అందుమూలంగా ముష్టి సొమ్ము ఎంత అవసరమో తెలుస్తోంది.

"కష్టించి పనిచేసి నీతినియమాలతో పరువుగా బ్రతకాలని ఆరాటపడేవారికి అందుకు వీలుగా తగిన ఆధారాలు చూపించి వారిని మంచిపౌరులుగా మననిస్తారో? లేక, జేబుదొంగలుగా, అవినీతిపరులుగా మారుస్తారో? అది మీపైన మీవంటి అధికారంలోగల పెద్దలపైన ఉంది. మీరు వారినోళ్ల దగ్గిరకూడుతీస్తే వాళ్ళు మీజేబుల్లో డబ్బులు తీస్తున్నారు. వాళ్ళు దొంగలు, శిక్షార్హులు,అయితే మీరు దొరలు, నీతిమంతులు ఎలా అవుతారో కాస్త ఆలోచించండి." ఆవేశంగా ఆ కాస్త మాటా అనేసి తనమాటల ఫలితం ఎలా ఉంటుంది? తనమిత్రుడికి న్యాయం జరుగుతుందా. లేదా? అన్న విషయాల గురించి పట్టించుకోకుండానే బైటికొచ్చేసేడు రామశాస్త్రి.

కారణం—ఇది ఒక సీతాపతి—ఒక సుబ్బారావుల సమస్యకాదు. ఒక జాతి సమస్య — నీతి, న్యాయం, సత్యం, ధర్మం అని పిలువబడే విలువలకి పరీక్ష.

అఖాతమంతటి ఈ సమస్య ముందు అణువంతటి సుబ్బారావు అప్పుడు అతడి దృష్టిలోలేడు. అతడి కథముగింపు అసలు సమస్యకి ము గిం పు కా దు-కాబోదు.

——